


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 141 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా గురువారం 2 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 141 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, THU 2 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం

సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు

స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ

వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగిన వేడుక

కల్యాణాన్ని వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు, తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుక అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా సాగింది. ఈ దివ్య కల్యాణ మహోత్సవం కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోయింది. వేలాది మంది భక్తులు ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు తరలివచ్చారు. రామనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పండితులు సంప్రదాయబద్ధంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించి, భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో

- మిగతా2లో

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం



- కాల్పుల విరమణ కోసం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అభ్యర్థించారని ట్రంప్ వెల్లడి
- అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని వివరణ
- హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిస్తేనే కాల్పుల విరమణపై పరిశీలన అని షరతు
- షరతులు అంగీకరించకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని హెచ్చరిక
- మళ్లీ రాతియుగానికి పంపిస్తాం అంటూ పోస్ట్

- మిగతా2లో



## అమరావతిపై చంద్రబాబుది డ్రామా.. ఇదే మా ప్లాన్ బీ

- అమరావతిపై అసెంబ్లీ తీర్మానం ఒక డ్రామా అన్న జగన్
- రాజధానిపై ప్లాన్-బీ ప్రతిపాదించిన మాజీ సీఎం
- మచిలీపట్నం-విజయవాడ-గుంటూరుతో 'మావిగన్' కారిడార్ సూచన
- సీఎం, మంత్రులు హైదరాబాద్‌కు షటిల్ సర్వీస్ చేస్తున్నారంటూ విమర్శ
- అమరావతి పేరిట లక్షల కోట్ల దోపిడీకి ప్లాన్ చేస్తున్నారని ఆరోపణ

- మిగతా2లో

## ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!: పొన్నం ప్రభాకర్
- బిల్లుకు చట్టబద్ధత నేపథ్యంలో ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపిన మంత్రి
- అయితే కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శ
- ఒక రాష్ట్రానికి చట్టబద్ధత కల్పిస్తూ, మరో రాష్ట్రానికి హామీలు విస్మరించడం సరికాదన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల

- మిగతా2లో

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం

## నేడు రాజ్యసభ ముందుకు బిల్లు

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- చర్చ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ ఎంపీలు
- నేడు రాజ్యసభ ముందుకు రానున్న బిల్లు
- రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారనున్న బిల్లు





**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం, ఈ బిల్లు ఆమోదం పొందినట్లు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు బిల్లుకు మద్దతు పలకగా, వైసీపీ ఎంపీలు చర్చ మధ్యలో సభ నుంచి వాకౌట్ చేశారు. 2024 జూన్ 2 నుంచి ఈ సవరణ వర్తించేలా బిల్లులో పొందుపరిచారు. ఈ చట్ట సవరణతో రాష్ట్రానికి అమరావతి ఏకైక రాజధానిగా చట్టపరమైన భద్రత లభిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, "అమరావతి రైతుల కన్నీళ్ల మీద ఈ చట్టం నిర్మాణమైంది. ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని" అని అన్నారు. బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, "అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు.లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు నేడు గురువారం (ఏప్రిల్ 2) రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. పెద్దల సభలో కూడా ఆమోదం పొందితే, రాష్ట్రప తి ఆమోదంతో చట్టంగా మారనుంది. దీం తో గతంలో వచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనకు చట్టపరంగా తెరపడినట్లవుతుంది.



## అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు...

### తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

- ఎల్ఐసీకి రూ.3,750 కోట్ల నష్టం కలిగించారన్న ఆరోపణలు
- రిలయన్స్ కమ్యూనికేషన్స్, అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు
- తప్పుడు సమాచారంతో రూ.4,500 కోట్ల ఎన్‌సీడీలు విక్రయించారని ఫిర్యాదు
- ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగా ఫిర్యాదు చేసిన ఎల్ఐసీ
- ఇప్పటికే పలు బ్యాంకుల మోసం కేసులను ఎదుర్కొంటున్న ఆర్‌కామ్

- మిగతా2లో

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది



- వింజమూరు సభలో వైసీపీని టార్గెట్ చేసిన సీఎం చంద్రబాబు
- కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం
- నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తామని హామీ
- గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి
- చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో'

- మిగతా2లో



## ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

- యూరప్‌ను తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందన్న రూబియో
- అణుబాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలో ఉందని వెల్లడి
- ఇరాన్‌పై సైనిక చర్య విజయవంతంగా సాగుతోందన్న అమెరికా
- చర్చలకు సిద్ధమేనని, కానీ షరతులు వర్తిస్తాయని స్పష్టం
- హోర్ముజ్ జలసంధిలో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరిక

- మిగతా2లో

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసోంలో పర్యటించిన ప్రధాని మోదీ
- తేయాకు తోటను సందర్శించి మహిళా కార్మికులతో కలిసి ఆకులు కోసిన వైనం
- గోగాముఖ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరు
- అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా
- రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని వ్యాఖ్యలు

- మిగతా2లో



## జగన్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. అమరావతిపై మంత్రి నారాయణ సమగ్ర వివరణ

- అమరావతి నిర్మాణ ఖర్చుపై జగన్ చెప్పేవన్నీ అబద్ధాలని ఖండన
- ప్రజాధనం ఒక్క పైసా లేకుండానే అమరావతి నిర్మాణం అని స్పష్టీకరణ
- అమరావతి ఆర్థిక రాజధానిగా రాష్ట్రానికి ఆదాయం తెస్తుందని వెల్లడి
- 2028 ఆగస్టు నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ధీమా

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# అమరావతికి ఓకే.. కానీ, కండీషన్స్ అప్లై

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు గాను ఏపీ పునర్విభజన చట్టానికి సవరణలు చేసేందుకు లోక్ సభ ఆమోదముద్ర వేసింది. అధికార, విపక్షాలు అన్నీ ఈ చట్ట సవరణకు మద్దతు తెలపడంతో మూజువాణి ఓటుతోనే లోక్ సభ ఆమోదముద్ర వేసినట్లైంది. అయితే సభలో ఈ అంశంపై మాట్లాడిన వివిధ పార్టీలు బిల్లుకు మద్దతు చెబుతూనే కొన్ని అభ్యంతరాలు లేవనెత్తడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా బిల్లును యథాతథంగా ఆమోదించలేమంటూ వాకౌట్ చేసిన వైసీపీతోపాటు బిల్లును సమర్థించిన కాంగ్రెస్, ఎస్పీ తదితర పార్టీలు కొన్ని కీలకసూచనలు చేశాయి.రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముందుగా న్యాయం చేయాలని వివిధ పార్టీలు సూచించాయి. ప్రధానంగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు? రైతులకు అభివృద్ధి చేసి ఇస్తామన్న ప్లాట్లు ఎప్పుడిస్తారు? రైతులు ఎలా న్యాయం చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని మొదటి దశ నిర్మాణం పూర్తికాకుండానే అదనపు భూ సమీకరణకు ఎందుకు వెళుతున్నారో స్పష్టం చేయాలని కోరారు.ఇక మిథున్ రెడ్డి తర్వాత సభలో మాట్లాడిన కాంగ్రెస్, సమాజ్ వాది ఎంపీలు సైతం అమరావతి బిల్లును సమర్థిస్తూనే కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా సమాజ్ వాది పార్టీకి చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. రాజధాని అమరావతి బిల్లును తాము సమర్థిస్తున్నామని, అయితే రాజధానిగా విశాఖను ఎంపిక చేస్తే బాగుండేదని ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా తమ పార్టీ రైతుల పక్షపాతి అని పేర్కొంటూ రాజధాని రైతులకు తక్షణ న్యాయం చేయాలని సమాజ్ వాది తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ సైతం రాజధానిగా అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎవరూ ఏపీకి అన్యాయం చేయాలని చూసినా తమ పార్టీ అంగీకరించదని తేల్చిచెప్పారు. అయితే రాజధాని రైతులకు న్యాయం చేయడం విస్మరించొద్దని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలు రఘురామిరెడ్డి, గడ్డం వంశీకృష్ణ సైతం రాష్ట్ర పునర్విభజన సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. విభజన హామీలను నెరవేర్చాలని వంశీకృష్ణ కోరగా, ఖమ్మంజిల్లాకు చెందిన గ్రామాలను తిరిగి తెలంగాణకు వదిలేయాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వ్యాఖ్యానించారు. మొత్తానికి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో అన్నిపార్టీలు ఒకే మాటపై నిలబడినా, రాజధాని రైతుల విషయంలో విపక్షం కొంచెం గట్టిగా మాట్లాడటం ప్రత్యేకంగా నిలిచిందని అంటున్నారు.

# హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

**హిట్ అండ్ రన్ కంటే దారుణం**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018-19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు.
కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సంక్షేమ పథకాల వెల్లువ**

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం వంటి పోర్టులు రానున్నాయని తెలిపారు.
ఉదయగిరిలో డ్రోన్లు, మానవ రహిత విమానాల తయారీ పరిశ్రమ రాబోతోందని, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారిందని అన్నారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

**సుపరిపాలన - చేనేతలకు వరం**

సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ మహాయజ్ఞానికి ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని, ప్రభుత్వ సేవల్లో లోపాలుంటే ఆకస్మిక తనిఖీలు చేస్తానని హెచ్చరించారు. డిసెంబరు నాటికి 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 11,443 పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, ఇందుకోసం రూ.153 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అనంతరం, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేనేతలు సీఎంను నూలు దండతో సత్కరించారు.

# తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.

**బహిరంగ సభలో రాహుల్ గాంధీపై విమర్శలు**

అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# అమరావతిపై చంద్రబాబుది డ్రామా.. ఇదే మా ప్లాన్ బీ

అమరావతి రాజధాని నిర్మాణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిని రూ.2 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణంగా అభివర్ణించిన ఆయన, దీనికి ప్రత్యామ్నాయంగా 'ప్లాన్ బి' పేరుతో 'మావిగన్' (మీూఎ×+ూచీ) అనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ ఈ రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడారు.

**ఏమిటీ 'మావిగన్' ప్లాన్?**

జగన్ వివరించిన 'మావిగన్' ప్రణాళిక ప్రకారం, మచిలీపట్నం నుంచి విజయవాడ (70 కి.మీ.), విజయవాడ నుంచి గుంటూరు (40 కి.మీ.) వరకు విస్తరించి ఉన్న 110 కిలోమీటర్ల కారిడార్‌ను రాజధాని ప్రాంతంగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో ఇప్పటికే 35-40 లక్షల జనాభా నివసిస్తోందని, జాతీయ రహదారి వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని జగన్ గుర్తుచేశారు. అమరావతికి ప్రతిపాదించిన రూ.2 లక్షల కోట్లలో కేవలం 10% నిధులు, అంటే రూ.20,000 కోట్లతో ఈ ప్రాంతంలో రింగ్ రోడ్లు, ఇతర అనుసంధాన మార్గాలు ఏర్పాటు చేస్తే, ఇది సహజంగానే ఒక మెగాసిటీగా, అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన వివరించారు. తన హయాంలో మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభించామని, దానివల్ల ఈ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో అవినీతికి ఆస్కారం తక్కువ కాబట్టే, ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రణాళికను పక్కన పెట్టిందని ఆరోపించారు.

**అమరావతి.. అవినీతి రాజధాని**

అమరావతిని 'అవినీతి రాజధాని'గా జగన్ అభివర్ణించారు. చంద్రబాబు ప్రభుత్వమే కేంద్రానికి, బ్యాంకులకు ఇచ్చిన లెక్కల ప్రకారం, అమరావతిలో కేవలం రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి కనీస వసతులకే ఎకరానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఈ లెక్కన 50,000 ఎకరాలకు రూ.1 లక్ష కోట్లు, లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయని, ఇది రాష్ట్రాన్ని దివాళా తీయించడానికేనని విమర్శించారు. చంద్రబాబు తన గత, ప్రస్తుత పాలనలో కలిపి ఏడేళ్లలో కేవలం రూ.8,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ వేగంతో ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందని ప్రశ్నించారు.నిర్మాణ వ్యయాల్లో భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నక్షత్రాల సౌకర్యాలతో ఫ్లాట్ నిర్మించడానికి చదరపు అడుగుకు రూ.4,500 ఖర్చయితే, అమరావతిలో రూ.11,000 నుంచి రూ.14,000 వరకు చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, భూమి, జీఎస్టీ మినహాయింపులు ఇస్తున్నా ఇంత భారీ వ్యయం ఎందుకని నిలదీశారు. టవర్ల నిర్మాణం, ఫ్లైఓవర్ల వ్యయాన్ని ఇతర నగరాలతో పోల్చి, భారీ వ్యత్యాసాలను ఎత్తిచూపారు. అమరావతిలో కిలోమీటర్ ఫ్లైఓవర్‌కు రూ.170 కోట్లు చూపిస్తుంటే, తన హయాంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో కేవలం రూ.35 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఢిల్లీలోని కొత్త పార్లమెంట్, తెలంగాణ సచివాలయం కన్నా ఏపీ అసెంబ్లీ, హైకోర్టుల నిర్మాణ వ్యయాలు ఎక్కువగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాయని, వారు అమరావతికి కేవలం షటిల్ సర్వీస్ చేస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు సుదీర్ఘకాలం పాలనలో ఉన్న చంద్రబాబు అమరావతికి ఏం చేశారని, రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అమరావతిపై తీర్మానం పేరుతో అసెంబ్లీలో చంద్రబాబు కొత్త డ్రామా ఆడారని, సభను కేవలం తనను, వైసీపీని దూషించడానికి వాడుకున్నారని విమర్శించారు. అమరావతిపై ఉన్న శ్రద్ధ వల్ల విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలన్నదే తమ విధానమని పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చాక అమరావతి కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను శిక్షిస్తామని జగన్ హెచ్చరించారు.

# ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు... తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, ఆయన సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి రూ.3,750 కోట్ల మేర నష్టం కలిగించారన్న ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌తో పాటు కొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులను నిందితులుగా చేర్చారు.ఎల్ఐసీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆర్‌కామ్ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చి, ఆస్తులకు మించిన భద్రత ఉందని నమ్మించి, రూ.4,500 కోట్ల విలువైన నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) ఎల్ఐసీకి మోసపూరితంగా అంటగట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
బీడీవో ఇండియా ఎల్ఎల్‌పీ అనే సంస్థ 2020 అక్టోబర్ 15న ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎల్ఐసీ తన ఫిర్యాదుకు ఆధారంగా చూపింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన నిధులను దుర్వినియోగం చేయడం, అనుబంధ సంస్థల ద్వారా నిధులను దారి మళ్లించడం, నకిలీ బిల్లులతో నిధులు పొందడం వంటి అనేక అక్రమాలకు ఆర్‌కామ్ పాల్పడినట్లు ఆడిట్‌లో తేలింది.ఆర్‌కామ్, అనిల్ అంబానీపై సీబీఐ కేసులు నమోదు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎస్‌బీఐకి రూ.2,929.05 కోట్లు నష్టం కలిగించారన్న కేసులో సీబీఐ అధికారులు అనిల్ అంబానీని ఢిల్లీలో రెండు రోజుల పాటు విచారించారు కూడా. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పలు బ్యాంకులు కూడా ఆర్‌కామ్‌పై ఫిర్యాదులు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులన్నింటిపైనా దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది.

# ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

యూరప్‌లోని సుదూర ప్రాంతాలను సైతం తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేపట్టిన సైనిక చర్యను సమర్థిస్తూ, ఇరాన్ ఆయుధ కార్యక్రమాలతో ప్రపంచానికి పెను ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు.
ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రూబియో మాట్లాడుతూ, ఇరాన్ ఇటీవల ప్రయోగించిన క్షిపణులు తమ అంచనాలకు మించిన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని తెలిపారు. "ఆ క్షిపణులు యూరప్‌లోని చాలా ప్రాంతాలకు చేరగలవు" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా లక్ష్యంగా చేసుకునే దీర్ఘశ్రేణి క్షిపణుల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను వేర్వేరుగా చూడలేమని రూబియో స్పష్టం చేశారు. "ఇరాన్ ఇప్పటికే 60 శాతం స్వచ్ఛతతో యురేనియంను శుద్ధి చేసింది. కేవలం 12 నుంచి 14 రోజుల్లోనే దాన్ని 90 శాతం స్వచ్ఛతకు (అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయి) చేర్చగలదు. అణుబాంబులో ఉపయోగించడానికి తప్ప 60 శాతం శుద్ధి చేసిన యురేనియం వల్ల మరో ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు.
ఇరాన్ తన అణు కార్యక్రమానికి రక్షణ కవచంగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించేందుకే సైనిక చర్య ప్రారంభించామని రూబియో తెలిపారు. ఇరాన్ వాయుసేన, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి లాంచర్లను నిర్వీర్యం చేయడం, డ్రోన్లు, క్షిపణుల తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం వంటి నాలుగు లక్ష్యాలతో ఈ ఆపరేషన్ సాగుతోందని చెప్పారు. "ఈ లక్ష్యాల సాధనలో మేము అనుకున్నదానికంటే వేగంగా ఉన్నాం. లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సైనిక చర్య కొనసాగుతున్నప్పటికీ, చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇరుపక్షాల మధ్య సందేశాలు మార్పిడి జరుగుతున్నాయని రూబియో అన్నారు. అయితే, చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని సహించబోమని, దొంగచాటు చర్చలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఇరాన్ ఆటంకం కలిగిస్తే అది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

# ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

భాగంగా జరిగే ఈ కల్యాణ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కల్యాణ వేడుక భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది.ఈ వేడుకలో చంద్రబాబు, భువనేశ్వరి దంపతులతో పాటు మనవడు నారా దేవాన్ష్ కూడా పాల్గొన్నాడు.

# ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- మొదటి పేజి తరువాయి

అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జగన్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. అమరావతిపై మంత్రి నారాయణ సమగ్ర వివరణ

మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణ ఖర్చులు, ఇతర అంశాలపై జగన్ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆయన పదేపదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో తాను స్వయంగా అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నానని, జగన్ మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు.

**అమరావతికి తిరుగులేని చట్టబద్ధత**

అమరావతి రాజధాని విషయంలో జగన్ ఇకపై ఎలాంటి గందరగోళం సృష్టించలేరని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014కు కీలక సవరణ చేసిందని, సెక్షన్ 5, సబ్-సెక్షన్ 2లో అమరావతి రాజధాని ప్రాంతాన్ని (217 చదరపు కిలోమీటర్లు) స్పష్టంగా నిర్వచించిందని తెలిపారు. ఈ చట్టసవరణతో రాజధానిపై పూర్తిస్థాయి స్పష్టత వచ్చిందని, ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని అన్నారు. గతంలో జగన్ ఆడిన "మూడు ముక్కలాట"కు ఈ సవరణతో తెరపడిందని, ఇకపై ఆయన ఎన్ని వేషాలు వేసినా చెల్లవని వ్యాఖ్యానించారు.

**ప్రజాధనంతో కాదు.. ల్యాండ్ పూలింగ్‌తోనే నిర్మాణం**

అమరావతి నిర్మాణానికి రూ. 2 లక్షల కోట్లు అవుతుందని జగన్ చెప్పడం హాస్యాస్పదమని మంత్రి నారాయణ కొట్టిపారేశారు. ప్రజాధనం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండానే రాజధాని నిర్మాణం జరుగుతుందని పునరుద్ఘాటించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన ల్యాండ్ పూలింగ్ విధానమే దీనికి ఆధారం. రైతుల నుంచి సమీకరించిన భూమిని అభివృద్ధి చేసి, వారికి కొంత వాటా ఇచ్చాక మిగిలిన ప్రభుత్వ భూమిని అమ్మి, ఆ డబ్బుతోనే నిర్మాణాలు చేపడతాం. దీనికోసం ప్రస్తుతం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటాం. ప్రభుత్వం వద్ద సుమారు 5,000 ఎకరాలకు పైగా భూమి ఉంది. భవిష్యత్తులో దీని విలువ పెరిగాక అమ్మితే, ఆ డబ్బుతో అప్పులు తీర్చడమే కాకుండా, రాష్ట్రానికి అదనపు ఆదాయం కూడా వస్తుంది" అని ఆయన వివరించారు.

**ఆర్థిక వృద్ధి కేంద్రంగా అమరావతి**

అమరావతి కేవలం పరిపాలనా రాజధాని కాదని, రాష్ట్రానికి ఒక ఆర్థిక చోదక శక్తి (ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్)గా మారబోతోందని నారాయణ ధీమా వ్యక్తం చేశారు. "ఈరోజు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 70 శాతం ఒక్క హైదరాబాద్ నుంచే వస్తోంది. అదేవిధంగా కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, మహారాష్ట్రకు ముంబై ఆర్థిక కేంద్రాలుగా ఉన్నాయి. ఆ నగరాల నుంచి వచ్చే ఆదాయాన్ని మిగతా జిల్లాల అభివృద్ధికి పంచుతున్నారు. అదే దూరదృష్టితో చంద్రబాబు అమరావతిని నిర్మిస్తున్నారు" అని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి నిర్మించడం ద్వారా పర్యాటకం, హోటల్ రంగం అభివృద్ధి చెంది, వేలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు.

**2028 ఆగస్టు డెడ్‌లైన్**

ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులు వేగంగా జరుగుతాయని, 2028 ఆగస్టు నాటికి అమరావతిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. కొన్ని భవనాలు ఇప్పటికే పూర్తయ్యాయని, దశలవారీగా మిగతా పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. తాము ప్రజల కోసం రాజధాని కడుతుంటే, జగన్ మాత్రం తన బొమ్మను సర్వే రాళ్లపై వేసుకోవడానికి రూ.750 కోట్లు, హైదరాబాద్, వైజాగ్‌లలో ప్రజాధనంతో ప్యాలెస్‌లు కట్టుకున్నారని తీవ్రంగా ఆరోపించారు.గత ఐదేళ్లలో రాజధాని కోసం భూములిచ్చిన రైతులను జగన్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను మంత్రి గుర్తుచేశారు. మహిళలని కూడా చూడకుండా బూటుకాళ్లతో తన్నారని, లాఠీఛార్జీలు చేసి, ఫెన్సింగ్ వేసి నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల త్యాగాలకు, పోరాటానికి ఈరోజు చట్టసవరణతో న్యాయం జరిగిందని, ఇక రాష్ట్ర ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ అజెండా

- అటువంటి మహా యజ్ఞాన్ని అడ్డుకుంటే సహించేది లేదు
- ఏపికి అమరావతే ఏకైక రాజధాని
- ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు
- పార్లమెంటులో బిల్లుపై స్పందించిన సీఎం
- చేనేతలకు అండగా ప్రజా ప్రభుత్వం
- రాష్ట్రంలో 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు
- రాష్ట్రంలో కొందరు చేసేవి హిట్ అండ్ రన్ నేర రాజకీయాలు
- నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు








కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఏప్రిల్ 1 ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యమని, అటువంటి మహా యజ్ఞాన్ని అడ్డుకుంటే సహించేది లేదని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అమరావతే ఏకైక రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎవరూ అంగుళం కూడా రాజధానిని కదల్చలేరని ఆయన అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో బుధవారం పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, లోక్‌సభలో చట్టబద్దత బిల్లుకు ఆమోదం పొందటం ఆంధ్రులకు దక్కిన గౌరవమని సీఎం అన్నారు. బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియచేశారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్దత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆ పార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

సంక్షేమానికి పెద్దపీట

ప్రతీ నెలా మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతీ నెలా రూ.2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెన్షన్ గా ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానం తోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు. గత ఏడాది జూన్ లో తల్లికి వందనం కింద ఆర్ధిక సహకారం అందించామని, ఈ ఏడాది జూన్ లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత సిలెండర్లను ఇస్తున్నామని త్వరలోనే ప్రతీ ఇంటికీ పైప్ ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. దీని కోసం ఏడాదికి రూ.2400 సబ్సీడిని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా రూ.1300 కోట్లను ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.

ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పాతచెరువుకు సోమశిల కాలువ నుంచి నీటిని తరలించేందుకు రూ.34 కోట్లతో పనులు చేపడతామని దీనిపై తక్షణం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి చెరువును నింపుతామని భరోసా ఇచ్చారు. నీటి భద్రత కోసం స్థానిక వింజమూరు ప్రజలు వేసిన ఒక్క అడుగుకు ప్రజా ప్రభుత్వం వంద అడుగులు ముందుకు వేసి తోడుగా నిలబడుతుందన్నారు. రూ.70 లక్షల వ్యయంతో చెరువును పునరుద్దరణకు తీసుకున్న చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. నీటి సంరక్షణ కోసం ప్రజలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని, రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ సెంటర్ తో పాటు రక్షణ పరికరాలు, మానవ రహిత విమానాలు తయారవుతాయని . ఇఫ్కో సెజ్ లో ఏర్పాటు కానున్న సౌర ఫలకాల తయారీ సహా వేర్వేరు పరిశ్రమల ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని 2018 లోనే కేంద్రానికి లేఖ రాసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. రూ.285 కోట్లతో దీని నిర్మాణం చేపట్టామని, దీనిని వక్రీకరించి కొందరు హిట్ అండ్ రన్ నేరాల రాజకీయం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. 2019-24 మధ్య జరిగిన అరాచక, విధ్వంస పాలన కొనసాగిందని అలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ మత్స్యకారులకు అన్యాయం చేసే పరిస్థితి ఉండదన్నారు. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులు ఎవరూ మన జలాల్లో చేపల వేట చేయకుండా నిఘా పెట్టాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లను సీఎం వేదిక నుంచి ఆదేశించారు.

నేతన్నలకు వెన్నుదన్నుగా ఉచిత విద్యుత్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇవాల్టి నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. 93 వేల చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకూ, 11,488 పవర్ లూమ్ లకు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. దీని కోసం మొత్తం 153 కోట్లను వ్యయం చేస్తున్నామని, ఉచిత విద్యుత్ పథకం వల్ల ఒక్కో చేనేత కుటుంబానికి వేల రూపాయల మేర ఆదా అవుతుందన్నారు. నేతన్న సంక్షేమానికి.. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. చేనేతల సంక్షేమం కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేశామని, 55 ఏళ్లకే పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ పథకం కింద 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం లబ్దిదారులకు ఉచిత విద్యుత్ సరఫరా ధృవపత్రాలను అందించారు. 21 నెలల్లో 5.5 లక్షల గృహప్రవేశాలు చేయించామని,డిసెంబరు లోగా 4.5 లక్షల ఇళ్లలో ప్రవేశించేలా నిర్మాణాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలందరికీ పౌరసేవలు మెరుగ్గా అందించటంతో పాటు వాటిపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పౌరసేవలు సరిగా అందకపోయినా, మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా ఆకస్మిక తనిఖీలు చేసి కఠినంగా వ్యవహరిస్తానని సీఎం స్పష్టం చేశారు. సుపరిపాలనా మహాయజ్ఞానికి ఎవరు నష్టం కలిగించినా సహించబోనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రజావేదిక సమీపంలో సూక్ష్మసేద్యం సహా డ్రోన్ సహకారంతో సేద్యానికి సంబంధించిన స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఫరూఖ్, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదమస్తాన్ రావు, ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేశ్, మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షూ శుక్లా తదితరులు హాజరయ్యారు.

# పేదల సేవలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు





కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ ఏప్రిల్ 1 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయగిరి నియోజకవర్గం, వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్నారు. వింజమూరు ఎస్సీ కాలనీలో లబ్ధిదారు యరగొర్ల బాలమ్మ ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తన చిన్న కుమారుడు బాలరాజు కాలేయ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని బాలమ్మ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. బాలరాజుకు ప్రభుత్వం తరఫున వైద్యం అందిస్తామని బాలమ్మ కుటుంబానికి సీఎం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల అలసత్వం పై అధికారులపై అసహనం



పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 01, నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని తన కార్యాలయంలో రెవిన్యూ,మున్సిపల్, అటవీ మరియు వైద్యశాఖ అధికారులతో ఆయన విడివిడిగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణంలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిపై వివరాలు రాబట్టారు.ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి విషయంగా ఉన్న అవరోధాలను ఆర్డీఓ భవానితో పాటు తహసిల్దార్ ఇన్బనాథన్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీంతో ఈ విషయంపై ఆయన కొంతఅసహనం వ్యక్తం చేశారు.ఈ అంశం వారంలోపు తేల్చాలని, వెంటనే ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని,ఇక ఆలస్యం జరగకూడదని అధికారులను ఆయన హెచ్చరించారు. అదేవిధంగా పలమనేరు రూరల్ మండలంలోని ఓ రోడ్డు నిర్మాణం విషయంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలపడంపై ఆయన వారితో చర్చించారు. రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మరోవైపు స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యర్థం ఏర్పాటు చేయదలచిన లిఫ్ట్ మరియు ఫ్రీజర్ రూమ్ ఏర్పాటు,బ్లడ్ బ్యాంక్ తదితర అంశాలపై వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో సబ్ డిఎఫ్ వేణుగోపాల్ రెడ్డి,ఎఫ్ఆర్ఓ నారాయణ,మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మరియు సిబ్బంది, ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ మమతా రాణి,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ జేఏసీ పలమనేరు తాలూకా చైర్మన్‌గా ఆనందబాబు ఎన్నిక




పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 01, చిత్తూరు జిల్లా ఏపీ జేఏసీ ఛైర్మన్ కెవి.రాఘవులు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కె.రమేష్ సూచనల మేరకు బుధవారం పలమనేరు ఎన్‌జీఓ హోమ్‌లో ఏపీజేఏసీ పలమనేరు తాలూకా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు,వివిధ శాఖల ఉద్యోగసంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపీ జేఏసీ పలమనేరు తాలూకా నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించగా ఛైర్మన్‌గా ఏపీ ఎన్‌జీజీఓస్ అధ్యక్షులు కె.ఆనంద బాబు,ప్రధాన కార్యదర్శిగా ఎస్‌టీయూ నాయకులు లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.సి. బాబు(యూటీఎఫ్),పి. మోహన్ రాంప్రసాద్ (పంచాయతీ కార్యదర్శుల సంఘం), ఎస్.హరి (జీడబ్ల్యూఎస్) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కృష్ణమూర్తి(పెన్షనర్ల సంఘం),బాలు(క్లాస్-5 ఉద్యోగుల సంఘం) ఎన్నిక కాగా, ఖజానాదారుగా మోహన్ (ఏపీఎస్‌ఆర్‌టీసీ) ఎంపికయ్యారు.ఈ సమావేశంలో చిత్తూరు తాలూకా ఎన్‌జీఓ కార్యదర్శి ప్రసాద్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు డి.వి. రమణ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొని,రానున్న రోజుల్లో ఉమ్మడి పోరాటాలకు అందరూ సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో జనసేన నాయకులు ఆకుల గజేంద్ర



పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 01, నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని జనసేన నాయకులు ఆకుల గజేంద్ర ప్రసాద్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి నాలుగు రోజుల క్రితం జనసేన పార్టీలో ఆయన చేరారు.దీంతో మొదటిసారి స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని మరియు కూటమి నేతలను ఆయన కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన పట్టణంలో భారీర్యాలీ నిర్వహించి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...తనకు రాజకీయంగా తొలి గురువు అమరనాథ రెడ్డి ఆయన తండ్రి రామకృష్ణ రెడ్డీలే నని వారి కుటుంబంతో తనకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉన్న విషయాన్ని తెలియజేశారు.తన ఆలోచనలకు అనుగుణంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ విధి విధానాలు నచ్చే జనసేన తీర్థం పుచ్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.తనకు తగిన గౌరవం గుర్తింపు లేని కారణంగానే వైకాపాను వీడానని ఇక తన జీవితాంతం జనసేనలోనే కొనసాగుతూ ప్రజాసేవలో రాణిస్తానని ఆయన స్పష్టం చేశారు. కూటమి పార్టీ నేతలతో కలిసి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పూల చైతన్య, నాగరాజు,చందు, అరుణ్,శివ,రాజేష్, రమేష్ లతో పాటు వీరమహిళ మురాదు తదితరులు పాల్గొన్నారు.

# రెండు తెలుగు రాష్ట్రాలకు సీఎం చంద్రబాబు ఒక వరం

**21 నెలల్లో ఉదయగిరిలో అభివృద్ధి, సంక్షేమానికి 1200 కోట్లు ఖర్చుచేశాం**
**ఉదయగిరి నియోజకవర్గంలో రెండు రక్షణ రంగ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి**
**40ఏళ్ల ఉదయగిరి ప్రజల కలలను నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**
**రానున్నరోజుల్లో ఉదయగిరి రూపురేఖలు పూర్తి మార్చేందుకు కృషి ఎమ్మెల్యే కాకర్ల సురేష్**







కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఏప్రిల్ 1 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వింజమూరు పర్యటనలో ప్రజా వేదిక వద్ద ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వింజమూరుకు రావడం చాలా సంతోషంగా ఉందని, ఉదయగిరి నియోజకవర్గ ప్రజల తరపున సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ చంద్రబాబు ఒక వరం అని కొనియాడారు. దివంగత ఎన్టి రామారావు విద్యాసంస్కరణలతో ఇంజనీరింగ్ చేసిన తాను బాబు గారి ఐటీ విప్లవంతో అమెరికాకు వెళ్లి మంచిపేరు సంపాదించినట్లు చెప్పారు. తనలాగా ఎంతోమంది ఐటీరంగంలో ఉన్నతంగా రాణించినట్లు చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో ఉదయగిరిలో రెండు భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడం పట్ల అందరూ ఆశ్చర్యపోతున్నారన్నారు. దుత్తలూరులో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్, ఉదయగిరిలో అనడ్రోన్ సిస్టమ్స్ అనే రెండు రక్షణ రంగ పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమం కంటే కూడా రెట్టింపు సంక్షేమాన్ని తమ ప్రభుత్వం అందించిందన్నారు. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలో 600 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు ఖర్చుచేస్తే, జాతీయ రహదారుల ఏర్పాటుకు 600 కోట్లు ఖర్చుచేసినట్లు చెప్పారు. పాతూరు చెరువుకు నీళ్లు నింపేందుకు నిధులు, నందవరం-ఉదయగిరి రోడ్డు, క్రాకుటూరు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులకు సీఎం అనుమతులు మంజూరు చేయడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రాకుటూరు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా 16వేల ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు అవకాశం కలుగుతుందన్నారు. 40 ఏళ్ల ఉదయగిరి నియోజకవర్గ ప్రజల కలలను సీఎం సాకారం చేశారని చెప్పారు. అలాగే ఉదయగిరి కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు. తమ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి నియోజకవర్గం రూపరేఖలు పూర్తిగా మారనున్నాయని కాకర్ల సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రెండు కార్లు ఢీకొని నలుగురు వ్యక్తులకు గాయాలు







బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 1. బుచ్చిరెడ్డిపాలెం ముంబై రహదారిలో గ్లోబల్ స్కూల్ సమీపంలో ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు ఒకరు నెల్లూరు నుంచి కడప వైపు వెళుతుండగా మరో కారు ఏఎస్ పేట నుంచి కోవూరుకు వెళుతుంది ఈ నేపథ్యంలో ముంబై రోడ్డుపై గారి బారికెట్లు ఏర్పాటు చేసి ఉండడం వలన కార్లు ప్రమాదానికి గురయ్యాయి దీంట్లో ఓ కారులో ఒక వ్యక్తి గాయపడ్డాడు అదేవిధంగా మరో కారులోని ఐదు మంది సభ్యులు ముగ్గురు తీవ్ర గాయాలకు గురయ్యారు వారిని హుటాహుటిన వైద్యశాలకు తరలించి సీఐ శ్రీనివాసరావు విచారణ జరుపుతున్నారు

# పేద కుటుంబాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

## ఇంటింటికీ వెళ్లి ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన..కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి





కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 1 పేదల కుటుంబాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలోని బుడంగుంట 17వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని అధికారులు,పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్వయంగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందజేశారు.అధికారులతో కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే, లబ్ధిదారులతో ఆత్మీయంగా ముచ్చటించారు.వారి ఆరోగ్య పరిస్థితులు,కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఈ సందర్భంగా తెలిపారు. పేదలు, వృద్ధులు, వికలాంగులకు ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథక లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి వర్గానికి అండగా నిలుస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనం చేరేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్వయంగా ఇంటికి వచ్చి పెన్షన్ అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు,కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్,ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, 17వ వార్డు టిడిపి ఇంచార్జ్ పులిమి భాస్కర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రామిరెడ్డి, టిడిపి యువ నాయకుడు బాలకృష్ణ,టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోరుతూబ్లాక్ డే నిరసన

కడప. పెన్ పవర్,ఏప్రిల్ 1:కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి లేబర్ కోడ్స్ అమలు చేయాలనే నిర్ణ యాన్ని వ్యతిరేకిస్తూ బుధ వారం ఆర్డిఓ కార్యాల యం వద్ద ఏఐటియుసి, సిఐటియు సంయుక్తంగా బ్లాక్‌డే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్టట.సి. బాదుల్లా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నుంచి భారత కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి త్యా గాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం దారుణమని పేర్కొన్నారు. దేశంలోని బడా పారిశ్రామిక వ్యక్తులు, శక్తులకు, కార్పొరేట్లకు తొత్తులుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ యజమానులకు అనుకూలంగా తీసుకు వచ్చారని విమర్శించారు. దేశంలోని జాతీయ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎలాంటి చర్చ జరపకుండా, కార్మిక సంఘాలతో మాట్లా డకుండా పార్లమెంట్లో మూజు వాణి ఓటుతో తీర్మానం చేసి ఏకపక్షంగా కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ తీసుకుని వచ్చిందని తెలిపారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలిసిన... కె.వి నాయుడు




పెళ్లకూరు, పెన్ పవర్,ఏప్రిల్ 01 రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పెళ్లకూరు మండలం చిల్లకూరు పి ఎ సిఎస్ అధ్యక్షుడు కెవి.నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాయుడుపేట పట్టణ సమీపంలోని బిరదవాడ వద్ద గల టిట్కో గృహ సముదాయాల అనంతరం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# 48 కోట్లతో కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరణ

**లేగుంటపాడు గ్రామంలో పెన్షన్ల పంపిణీ.**
**ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం, విలేజ్ క్లీనిక్ శంఖుస్థాపన.**





కోవూరు పెన్ పవర్ ఏప్రిల్ 1. ధాన్యం విక్రయాలలో ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురండి.ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మాభిమానంతో బతకాలి అన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో పెన్షన్ పంపిణీ కారక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె 38 లక్షలతో నిర్మిచిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవంతో పాటు 36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దశాబ్దాలుగా మరమ్మత్తులకు నోచుకోని కనిగిరి రిజర్వాయర్ తక్షణ మరమ్మత్తులకు 5 కోట్లు రిజర్వాయర్ ఆధునీకరణకు 48 కోట్ల రూపాయలు కేటాయించిన సిఎం చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలిపారు. పెన్నా డెల్టా ఛైర్మన్ గా జెట్టి రాజగోపారెడ్డి అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు.

తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక చేసిన మొట్ట మొదటి శంఖుస్థాపన లేగుంటపాడు వాటర్ ట్యాంకేనని 20 నెలల్లో పూర్తి చేసి వాటర్ ట్యాంక్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత వైసిపి పాలనలో అభివృద్ధి పనులను శంఖుస్థాపనలకే పరిమితం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. లేగుంటపాడు గ్రామం నుంచి హైవేకు కనెక్ట్ చేస్తూ గతంలో రోడ్డు మంజూరైనా కాంట్రాక్టర్ తో బేరసారాలు కుదరక ఆగిపోయిందని కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన విషయాన్నిఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 21 నెలల్లో లేగుంటపాడు గ్రామాభివృద్ధి కోసం 2 రెండు కోట్ల 59 లక్షల 6 వేల రూపాయల ఖర్చు పెట్టామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు.

సూపర్ సిక్స్ లో హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అమలు చేసిన తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. 2 వేలున్న వృద్ధాప్య పెన్షన్ 3 వేలకు పెంచడానికి 5 ఐదేళ్లు పడితే ఒక్క సంతకంతో 3 వేలున్న వృద్ధాప్య పెన్షన్ 4 వేలకు 3 వేలున్న దివ్యాంగుల పెన్షన్ 6 వేలు పూర్తి అంగవైకల్యతో వున్న వారికి 15 వేల రూపాయలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దక్కుతుందన్నారు. ధాన్య విక్రయాలలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రైతులను కోరారు. గత సంవత్సర రబీ సీజన్ లో ధాన్యం విక్రయించిన 24 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ ఈ సంవత్సరం ధాన్య సేకరణలో ఎదురైనా ఇబ్బందులు పరిష్కరించేందుకే సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చారన్నారు. తమది రైతు ప్రభుత్వమని రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల తెలుగుదేశం మరియు కూటమి పార్టీల ముఖ్య నాయకులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ లు పంపిణీ చేసిన- కె.వి.నాయుడు



పెళ్లకూరు, పెన్ పవర్, ఏప్రిల్ 01 మండల పరిధిలోని రావులపాడు పంచాయతీలో చిల్లకూరు పి ఎ సిఎస్ అధ్యక్షుడు కె.వి నాయుడు బుధవారం జరిగిన సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ చేశారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వ తాతల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం ప్రతినెల 1వ తారీకు ఉదయం 6 గంటలకే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేస్తుందన్నారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో రావులపాడు పంచాయతీలో పెన్షన్ లు పంపిణీ చేసినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ జయకృష్ణ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేస్తున్న గ్రామ సర్పంచులకు ఘన సన్మానం





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 1. గ్రామ ప్రథమ పౌరుడన్న పేరే గానీ వీధి లైట్లు వేయించాలన్నా సర్పంచులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన దుస్థితి. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది కూటమి ప్రభుత్వంలో అధికారంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం. కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడంలో భాగస్వాములు కండి.సర్పంచుల పదవి విరమణ సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కోవూరు నియోజకవర్గ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని ఈ రోజు పదవీ విరమణ చేస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన 43 మంది సర్పంచులకు నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కార్యాలయంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. గతంలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా పదవీ విరమణ చేస్తున్న సర్పంచుల సేవలను కొనియాడుతూ వారికి నూతన వస్త్రాలతో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గత ప్రభుత్వ నిర్వాకాలపై ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలను కాలరాస్తూ స్థానిక సంస్థలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారన్నారు.గ్రామ ప్రథమ పౌరులన్న పేరే గాని కనీసం వీధి లైట్లు వేయించాలన్నా వేయించాలన్నా సర్పంచులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన దుస్థితిని కల్పించారన్నారు. 15 వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచుల ప్రమేయం లేకుండా గత ప్రభుత్వం అడ్డగోలుగా దారి మళ్లించిందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలపై మమకారంతో అప్పులు తెచ్చి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు బిల్లులు రాక గత ఐదేళ్లలో తీవ్ర మానసిక క్షోభ అనుభవించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పంచాయతీలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13 వేల 326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజాస్వామ్యానికి ఊపిరి పోశారన్నారు. ఉపాధి హామీ మరియు ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకే చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పల్లె పండుగ పేరిట ప్రభుత్వం సిమెంట్ రోడ్లు, తాగునీటి పథకాలు, పాఠశాలల మరమ్మతులే కాకుండా ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మిస్తూ గ్రామాల రూపు రేఖలే మారుస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో ఉన్న ప్రతి రూపాయి గ్రామాభివృద్ధికే ఖర్చు చేసేలా ప్రభుత్వం పారదర్శకతనుతీసుకొచ్చిందన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక మైపాడు బీచ్ లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం 5 కోట్లు 17 కోట్ల 50 లక్షలతో 323 సిసి రోడ్లు, 14 కోట్ల 74 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్స్, 800 మంది అనారోగ్య బాధితులకు 8 కోట్ల రూపాయలతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం, సీఎస్ఆర్ ఫండ్స్ మరియు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 21 నెలల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మాజీలవుతున్న సర్పంచులు పదవి నుంచి మాత్రమే విరమణ పొందుతున్నారని ప్రజా సేవ నుంచి కాదని నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. పదవీ విరమణ సందర్భంగా గతంలో ఎన్నడూ ఈ విధంగా సన్మానాలు, సత్కారాలు జరగలేదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తమను గుర్తించి గౌరవించడం చాలా సంతోషంగా వుందన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమస్యలపై స్పందిస్తున్న తీరు పట్ల పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు.

# చట్టాల అమలులో జాగ్రత్తలు అవసరం

## - జన్ విశ్వాస్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ఎంపీ గురుమూర్తి కీలక సూచనలు




తిరుపతి/పెన్ పవర్/ఏప్రిల్ 01 జన్ విశ్వాస్ సవరణ బిల్లుపై బుధవారం పార్లమెంటులో జరిగిన చర్చలో వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొని కీలక సూచనలు చేశారు. వివిధ చట్టాలలో ఉల్లంఘనలను చేర్చి అమలు వ్యవస్థను బలోపేతం చేయడం మంచి చర్యేనని పేర్కొంటూనే, చిన్న, పెద్ద ఉల్లంఘనల మధ్య స్పష్టమైన తేడా లేకపోతే అమలులో అసమానతలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

జైలు శిక్షల స్థానంలో ఎక్కువగా నగదు జరిమానాల విధానం తీసుకురావడం వల్ల కొన్ని సందర్భాల్లో నిరోధక ప్రభావం తగ్గే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా భద్రతకు సంబంధించిన కీలక ఉల్లంఘనల్లో కఠిన చర్యలు అవసరమని స్పష్టం చేశారు. నియంత్రణ వ్యవస్థలు బలోపేతం కావడం, నేరాల నమోదులో పారదర్శకత పెరగడం సానుకూలమేనని చెప్పినా, అవి సమర్థవంతంగా పనిచేయాలంటే బలమైన డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థలు అవసరమని అన్నారు.

విచారణ, తీర్పు, అమలు అధికారాలు ఒకే వ్యవస్థలో కేంద్రీకృతమైతే న్యాయసూత్రాలపై ప్రభావం పడే అవకాశం ఉందని గురుమూర్తి హెచ్చరించారు. సముద్ర, పోర్టు, షిప్పింగ్ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు వ్యాపార సౌలభ్యాన్ని పెంచుతాయని అభిప్రాయపడ్డారు. అయితే తీవ్రమైన మోసాలకు సంబంధించి క్రిమినల్ శిక్షలు లేకపోతే బాధ్యత తగ్గే ప్రమాదం ఉందని సూచించారు. మెర్కెంటైల్ మెరైన్ విభాగానికి సమగ్ర డిజిటల్ ఈ–పోర్టల్ ఏర్పాటు చేసి అనుమతుల ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా మార్చాలని కోరారు.

డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940 మరియు ఫార్మసీ చట్టం, 1948 సవరణలపై మాట్లాడుతూ, జైలు శిక్షల స్థానంలో జరిమానాలు విధించడం ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అన్నారు. నకిలీ మందుల నియంత్రణలో కఠిన చర్యలు అవసరమని, కార్మిక చట్టాల్లో కూడా కేవలం జరిమానాలు సరిపోవని, కార్మికుల హక్కులను రక్షించేందుకు బలమైన అమలు వ్యవస్థలు అవసరమని సూచించారు.

వివిధ రంగాల్లో సమన్వయం, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, రియల్ టైమ్ అమలు వ్యవస్థలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గురుమూర్తి పేర్కొన్నారు. తమ పార్టీ తరపున బిల్లుకు మద్దతు తెలుపుతూ, సమర్థవంతమైన అమలు, పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థలతో ఈ సంస్కరణలు ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించక పోతే సమ్మె బాట పడుతాం సిఐటియు



తిరుపతి/పెన్ పవర్/ఏప్రిల్ 01 స్విమ్స్ కార్మికులు చేస్తున్న పోరాటం బుధవారం, ఏప్రిల్ 1వ తేదీ నాటికి 34వ రోజుకు చేరుకున్నది. 34 రోజులు పడుతుంది యాజమాన్యం వ్యవహరిస్తున్న వ్యతిరేకిస్తూ స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్ మాట్లాడుతూ, మార్చి 6న జరిగిన చర్చలలో యాజమాన్యం మార్చి 31 వరకు గడువు ఇవ్వాలని కోరిందని, కార్మికులు మొదట మార్చి 25 వరకు మాత్రమే గడువు ఇచ్చినా, తదుపరి చర్చల నేపథ్యంలో 31 వరకు అంగీకరించినట్లు తెలిపారు. మార్చి 31 గడువు పూర్తయినా యాజమాన్యం సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు. “మాట ఇచ్చి మాట తప్పడం ఎన్ని సార్లు చేస్తారు? కార్మికులను ఇంకా ఎంతకాలం మోసం చేస్తారు?” అని ఆయన నిలదీశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 జూన్ నెలలో 10 రోజుల పాటు దీక్షలు చేపట్టినప్పుడు టీటీడీ పరిధిలోని అధికారులు, డైరెక్టర్, ఎస్పీ, కలెక్టర్ తదితరులు మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. “ఆ హామీలు ఎక్కడ? 10 నెలలు గడిచినా ఎందుకు అమలు కాలేదు?” అని ప్రశ్నించారు. 2026 ఫిబ్రవరి 27న కార్మికులు తిరిగి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారని, ఆ తరువాత నాలుగు సార్లు చర్చలు జరిగినప్పటికీ యాజమాన్యం సమయం కోరుతూ గడువులు తీసుకుంటూనే ఉందని విమర్శించారు. “గడువులు అడగడం తప్ప సమస్యలు పరిష్కరించే ఉద్దేశం యాజమాన్యానికి ఉందా?” అని నిలదీశారు. డిసెంబర్ నెలలో సమ్మె నోటీసు ఇచ్చినా, కార్మికులు శాంతియుతంగా వ్యవహరిస్తూ ఫిబ్రవరి 27 వరకు, ఆ తరువాత మార్చి 31 వరకు సహనంతో ఎదురుచూశారని తెలిపారు. “ఇంత సహనం చూపించిన కార్మికులను ఇంకా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?” అని ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇకపై సమ్మె కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఏ క్షణమైనా కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె బాట పడతారని స్పష్టం చేశారు. ఈ సమ్మె వల్ల జరిగే అన్ని పరిణామాలకు, నష్టాలకు స్విమ్స్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి. రవి, అధ్యక్షులు వి. సూరి, కోశాధికారి మారి ముత్తు, గోపి, మునికృష్ణ, ఎం. వెంకటేష్, జనార్ధన్, పి. వెంకటేష్, జయచంద్ర, జయమ్మ, బానమ్మ, సుహాసిని, లీలావతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో డ్రగ్స్ మరియు వైద్య నియంత్రణపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్



చిత్తూరు,పెన్ పవర్, ఏప్రిల్ 01, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఈరోజు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డ్రగ్ మరియు మెడికల్ రెగ్యులేషన్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈగల్ సెల్ ప్రతినిధులు,డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మరియు మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో అక్రమ మందుల విక్రయాలు, లింగ నిర్ధారణ పరీక్షల నివారణపై కలెక్టర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో అబార్షన్ కిట్ల దుర్వినియోగం పెరుగుతోందని,వీటి విక్రయాలపై కఠిన నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.?లింగ నిర్ధారణ పరీక్షల నివారణ:అక్రమ లింగ నిర్ధారణ పరీక్షల వల్ల జిల్లాలో లింగ నిష్పత్తి దెబ్బతింటోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు.ఆడపిల్లల భ్రూణ హత్యలకు కారణమయ్యే ఇటువంటి పద్ధతులను మెడికల్ అసోసియేషన్ సభ్యులు అడ్డుకోవాలని సూచించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ నార్కోటిక్ మందులను విక్రయించకూడదు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి మెడికల్ ఏజెన్సీ మరియు డ్రగ్ డీలర్ తమ వద్ద ఉన్న స్టాక్ రిజిస్టర్లను, బిల్లులను ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. కేవలం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే కిట్లను పంపిణీ చేయాలని అన్నారు. ఇప్పటికే నమోదైన రెండు కేసుల్లో నిందితులపై పి.డి.యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అక్రమ విక్రయాలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉన్నవారు వెంటనే ఈగల్ టోల్–ఫ్రీ నంబర్ 1972 కు ఫిర్యాదు చేయాలని కోరారు.?వైద్య రంగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్యం, చదువు విషయంలో జాగ్రత్త వహించాలి

### రాత్రి వేళల్లో వసతి గృహాలలో భద్రతపై తగుచర్యలు చేపట్టండి

### వసతి గృహాలలో పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి : జిల్లా కలెక్టర్



చిత్తూరు,పెన్ పవర్, ఏప్రిల్ 01, పిల్లల చదువు, ఆరోగ్యంపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు,మౌలిక వసతుల కల్పనపై అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో వసతి గృహాల నిర్వహణ సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శంకర్, సాంఘిక సంక్షేమ అధికారి రబ్బానీ భాష, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..వసతి గృహాలలో ఉండే విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, పిహెచ్సి పరిధిలోని బాలికలు వసతి గృహాలను మెడికల్ ఆఫీసర్లు,ఏఎన్ఎంలు తరచుగా పరిశీలించి బాలికలకు అవసరమైన వైద్యసేవలు అందించి వారి సందేహాలను నివృత్తి చేయాలని, ఆ దిశగా వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరుని అందించేలా తాగునీటి ట్యాంకర్లను పంచాయతీ సెక్రెటరీతో సమన్వయం చేసుకొని శుభ్రం చేయించాలన్నారు.

వసతి గృహాలలో పిల్లల భద్రతకు సంబంధించి నిర్లక్ష్యానికి తావివ్వరాదని,అన్ని వసతి గృహాలలో వార్డెన్ లు రాత్రిపూట ఎంతవరకు ఉన్నది నిర్ధారించేలా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. బంగారుపాళ్యం, పలమనేరు మరియు కార్వేటినగరం ప్రాంతాలలో ఉన్న కొన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లను స్వయంగా సందర్శించి,అక్కడి పరిస్థితులను పరిశీలించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా,చిత్తూరు, పలమనేరు మరియు కార్వేటినగరం ప్రాంతాలలో ఉన్న హాస్టళ్లను సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,పంచాయతీ రాజ్ వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మత్తు మరియు

నిర్వహణ పనులను అత్యవసర ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్, కుప్పంలో తగిన సౌకర్యాలు లేని దృష్ట్యా, హాస్టల్ను సజావుగా నిర్వహించేందుకు మరియు విద్యార్థులకు మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించుటకు ప్రాజెక్టు డైరెక్టర్,కడా,కుప్పం వారి సహకారంతో అనుకూలమైన అద్దె భవనాన్ని గుర్తించాలని సహాయ సాంఘిక సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ సంక్షేమ వసతి గృహాల అధికారులు బాధ్యతగా పనిచేయాలి,విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, బాధ్యతగా మీ విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో వివిధ సంక్షేమ వసతి గృహాలకు ఎల్పిజి గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా సివిల్ సప్లై అధికారికి ఆదేశాలు జారీ చేశారు, జిల్లాలో వివిధ అంగన్వాడి కేంద్రాలలో ఆయా పోస్టులు భర్తీ కొరకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఐసిడిఎస్ పిడి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంక్షేమ వసతి గృహాల వార్డును తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధానికి చట్టబద్ధత రాష్ట్రాభివృద్ధికి దృఢమైన పునాది: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి బిల్లుకు లోక్ సభలో ఆమోదం పొందటంపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి రాజధాని చట్టబద్ధతలో భాగస్వాములైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ యువ నేత మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు చెప్పారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచే చారిత్రాత్మక నిర్ణయమని, అమరావతి రాజధాని స్థాపన అనేది కేవలం పరిపాలనా అవసరం మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి ఒక సంకల్పబలమన్నారు. రైతుల త్యాగాలు, ప్రజల ఆశలు, రాష్ట్రాభివృద్ధి దిశగా ఉన్న ఆకాంక్షలకు ఇది ఒక న్యాయం చేసినట్టుగా భావిస్తున్నానని చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా వస్తాయని, మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయనీ, ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా మరింత ముందుకు సాగేందుకు ఇది బాటలు వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాననీ, భవిష్యత్తులో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

# భూ ఆక్రమణలపై రైతుల నిరసన.

## --పేదల భూములపై ప్రైవేట్ వ్యక్తుల కన్ను.
## --కొత్తపాలెం రైతుల గళం...
## --అధికారుల అండతోనే అక్రమాలు..






తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,ఏప్రిల్ 1. తమ పూర్వీకుల కాలం నుండి గ్రామస్తుల సాగులో ఉన్న భూములను దౌర్జన్యంగా ఆక్రమించారని రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ రైతులు ఆరోపించారు. బుధవారం తిరుపతిలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ........ సర్వేనెంబర్ 150 నుండి 155 వరకు ఏడు ఎకరాల భూమిని ఓ ప్రైవేటు విద్యాసంస్థల అధినేత ఆక్రమించి ప్రహరీ నిర్మించారని తెలిపారు. రెవెన్యూ రికార్డులలోని అడంగల్ రికార్డుల్లో పేర్లు మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మా భూముల్లో రియల్ ఎస్టేట్ దందా ఏంటి....?

70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిపై ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎలా చేస్తారు అని కొత్తపాలెం రైతులు ప్రశ్నించారు ప్రెస్ క్లబ్లో జరిగిన సమావేశంలో వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గతంలో నీటి వసతి లేక సాగు నిలిపివేస్తే ఆ అదులు చూసి అడంగల్ రికార్డుల నుండి తమ పేర్లను తొలగించారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు రెవెన్యూ అధికారులు ఎలా సహకరిస్తారని రైతులు నిలదీశారు. న్యాయం జరగకుంటే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ శాఖ..!

రైతుల భూములతో పాటు ప్రభుత్వ భూములను కలుపుకొని గుట్టు చప్పుడు కాకుండా చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీశారు. సదరు అధికారులు ఆ భూముల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడానికి వెళ్ళినా కూడా గేటు బీగాలు వేయడంతో ఏమి చేయలేని స్థితిలో అధికారులు వెనుతిరిగారు. ఈ తంతు వ్యవహారం కొత్తపాలెం గ్రామ లెక్క దాకాల్లో కొనసాగుతూ ఉంది.

ఈ కార్యక్రమంలో బాధిత రైతులు వి మునిరెడ్డి కే ఆనందముని శ్రీ రాధా పి మునిరెడ్డి కే ప్రభాకర్ కె నాగరాజు ఆర్ రామకృష్ణారెడ్డి కే నాదముని తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ల మంజూరు ఎప్పుడు కాకాణి





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 1. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, కంటే పల్లి గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పాత పెన్షన్ లతో కాలయాపన చేయడం తప్ప కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదు జగన్మోహన్ రెడ్డి నాడు మంజూరు చేసిన పెన్షన్ లనే తమ ఘనతగా ప్రతినెలా వచ్చి, పెన్షన్ల పంపిణీ పేరిట చంద్రబాబు దగ్గర నుండి సాధారణ కార్యకర్త వరకు ,నానా హడావిడి చేస్తున్నారు చంద్రబాబు పాత పెన్షన్ ల పంపిణీ పేరిట విమానాలు, హెలికాప్టర్లలో తిరగడం, ప్రభుత్వ ఖర్చుతో సమావేశాలు నిర్వహించడం మానేస్తే, కనీసం కొన్ని అయినా కొత్త పెన్షన్ లు మంజూరు అయ్యే అవకాశం ఉండేది ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం ధాన్యం ధరలు రోజురోజుకీ తగ్గుదల కనిపించడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్న కాకాణి కూటమిపాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న కాకాణి రైతులకు యూరియా సరిగా దొరక్క, సాగునీరు సాఫీగా అందక అష్ట కష్టాలు పడి పంటలు పండించుకుంటే, ధాన్యం చేతికి వచ్చే సమయానికి మద్దతు ధర లేక రైతులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారన్న కాకాణి కూటమి పాలకులు, అధికారుల, నిర్లక్ష్యం వల్లే మిల్లర్లు,దళారులు చెలరేగిపోతున్నారన్న కాకాణి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, దాన్యం సేకరించారని గుర్తుచేసిన కాకాణి కంటే పల్లి గ్రామంలో వెలిబోయిన నందయ్య భౌతికాయానికి నివాళులర్పించిన కాకాణి

# పిఆర్‌సి అమలులో జాప్యం తగదు : యుటిఎఫ్

కడప .పెన్ పవర్,ఏప్రిల్ 1ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జాబీర్ హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రణభేరి 3.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపా ధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శి ంచారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. పిఆర్‌సి గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లు అయిందని, అయినప్పటికీ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటులో తాత్సారం చేస్తుందని విమర్శించారు. పిఆర్‌సి అమలుకు నోచుకోక పోవడం వల్ల విరమణ పొందుతున్న ఉ ద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పంది ంచకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తా మని, అవసరమైతే సెక్రటేరియట్ ముట్టడి చేపడ తామని హెచ్చరించారు. ఎపి జెఎసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యా యులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పిఆర్‌సిని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. యు టిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రతిప క్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, అధికార పక్షంలోకి రాగానే మరోరకంగా వ్యవహరించడం తగదన్నారు. సిఐటి యు అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు కె.శ్రీ నివాసులురెడ్డి, బి.మనోహర్, ఎల్ఐసి డివిజన్ కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు బి.రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం సాగిస్తున్న యుటిఎఫ్ దీక్షలకు తాము పూర్తి సంఘీభావం, మద్దతు తెలియ జేస్తున్నామన్నారు.






## అక్రమ కేసులపై ఎదుర్కొనేందుకు... లీగల్ సెల్.



తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 1. కూటమి ప్రభుత్వం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమంగా బనాయిస్తున్న కేసులను ఎదుర్కొనేందుకు వైఎస్ఆర్ సి పి లీగల్ సెల్ అందుబాటులో ఉంటుందని అన్నారు భూమన అభినయ రెడ్డి. వైయస్సార్ సిపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. ..వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలకు లీగల్ సెల్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కోవాలని సిద్ధంగా ఉందన్నారు. పార్టీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, లీగల్ సెల్ ద్వారా పూర్తి సహాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలని చర్చించారు. ఇందులో లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు ×జూ చంద్రశేఖర్ రెడ్డి, నరహరి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, ఆర్టిఐ వింగ్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, నగర అధ్యక్షుడు రాజశేఖర్, ఆర్.టి.ఐ నగర అధ్యక్షుడు సోమేశ్వర్ రెడ్డి, శైలేంద్ర, శ్రీనివాసులు రెడ్డి, మహాదేవ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# చిత్తూరు జీహెచ్‌లో టిహెచ్ లెప్రసీ వార్డ్ ప్రారంభం

## రోగులకు మెరుగైన వైద్య సేవలం దించడమే లక్ష్యం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్.



చిత్తూరు,పెన్ పవర్, ఏప్రిల్ 01, చిత్తూరు జిల్లా హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్‌లో టిహెచ్ లెప్రసీ వార్డ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు గురుజాల జగన్మోహన్, జిల్లాకలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్,చుడా చైర్మన్ కటారి హేమలత,మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మాజీ మేయర్ అముద తదితరులు హాజరయ్యారు. ప్రారంభోత్సవం సందర్భంగా లెప్రసీ రోగులకు ఎంసీఆర్ ఫుట్వేర్ మరియు బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగురుజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. లెప్రసీ రోగులకు అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.సమాజంలో వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. లెప్రసీ వార్డ్‌కు అవసరమైన ఫిజియోథెరపీ పరికరాలను త్వరలోనే సమకూరుస్తామని తెలిపారు.రోగులకు సమగ్రంగా సమయానికి సరైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్‌హెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బిజి, డీసీహెచ్ఎస్ డా. పద్మాంజలి,మెడికల్ సూపరింటెండెంట్ డా. ఉషశ్రీ, ఆర్ఎంఓ శ్రీమతి సంధ్య, టిహెచ్ లెప్రసీ వార్డ్ మెడికల్ ఆఫీసర్ జానకిరావు,అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెడ్ బాలరాజ్ ఎస్, జిల్లా లెప్రసీ,ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డాక్టర్ జి. వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 1వ తేదీ రాష్ట్రంలో పండుగ





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 1. వాతావరణంలో పెన్షన్ ల పంపిణీ. టీడీపీ నాయకులు కోటంరెడ్డి నెల్లూరు రూరల్ లో తెలుగుదేశం జెండా రెపరెపలాడుతోంది. రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మెన్ జెడ్. శివప్రసాద్ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని మాదరాజు గూడూరు గ్రామం నందు ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లను పంపిణీ చేసిన రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మెన్ జెడ్. శివప్రసాద్ మరియు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రతి నెల నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 30,664 మంది పెన్షనర్లకు ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ కార్యక్రమం ద్వారా 13 కోట్ల 49 లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నాం. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చెప్పినమాటకి కట్టుబడి ఉండే వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెన్షన్ ల నగదు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జాతరలా నిరంతరం సాగుతున్నాయి. రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మెన్ జెడ్. శివప్రసాద్.అభివృద్ధిని కేవలం నగరానికే కాకుండా గ్రామాలలో కూడా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మెన్ జెడ్. శివప్రసాద్.3 ఫేజ్ 24 గంటల కరెంటు పనులు రాష్ట్రంలోనే చాలా తక్కువ సమయంలో నెల్లూరు రూరల్ లో చాలా వేగంగా పూర్తిచేసి, ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా చేసారు. రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మెన్ జెడ్. శివప్రసాద్.పై కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ సి. హెచ్. వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ సారంగం గున్నయ్య, మాదరాజుగూడూరు పి.ఎ.సి.యస్.

సొసైటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు పందిపాటి రాము, వార్డ్ మెంబర్ నవీన్, టిడిపి నాయకులు ఉప్పు కృష్ణయ్య, బెల్లంకొండ విజయ్ కుమార్, నెట్రంబాక రాజేంద్రప్రసాద్, పంబడి సురేంద్ర, తాండ్ర సుధాకర్, లేబూరు అశోక్, తాండ్ర వెంకటేశ్వర్లు, వెంకట కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, పి.సుందర్, బుజ్జయ్య, పి.శ్రీను, టి. రమణయ్య, మారిపాటి శ్రీను, జనార్దన్ రెడ్డి, లేబూరు గణేష్, శీను, కుమార్, మదన్, రవి, శివ, శేఖర్, మహేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం..రమణీయం



దేశంలోనే రెండో భద్రాద్రిగా పేరు గాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయ ప్రాంగణంలో బుధ వారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణం భక్త జనసందోహం, శ్రీరామ నామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. పరాభవ నామ సంవత్సరం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని పౌర్ణమి పండు వెన్నెల్లో తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సేవకులు పెద్దఎత్తున విచ్చేశారు. కడప-చెన్నరు ప్రధాన రహదారికి సమీపంలోని విశాలమైన మైదానంలో ఆకాశమంత చలువ పందిళ్లు వేసి పలు రకాల పూల పరిమళాలు, విద్యుత్ కాంతులు, భక్తుల కోలా టాలు, విద్యుత్ దీపాలంకారణలతో కూడిన కల్యాణ వేదిక వైకుం ఠాన్ని తలపించింది. అంతకు ముందు సీతారాములవారిని ఆలయం నుంచి ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడమ కల్యాణ మండపం వద్ద ఆసీనులను చేశారు. వేదపండితులు ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ వేదిక ప్రాంగణం నుంచి వీనుల విందుగా సాగిన వ్యాఖ్యానాలు, ప్రవచనాలు ప్రజలను తన్మయులను చేశాయి. కల్యాణ వేదిక ప్రాంగణంలో పలుచోట్ల ఎల్ఇడి తెరలను ఏర్పాటు చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి ఏర్పాటు చేశారు. తమ వంశం గొప్పదంటే తమ వంశమే గొప్పదని కొంత మంది వేద పండితులు సీతమ్మ వైపు, శ్రీరాముల వారి వైపు మరికొందరుచేరి వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాలనడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి.ప్రజాశక్తి-ప్రజాశక్తి ప్రతినిధి/ఒంటిమిట్టశ్రీకోదండరామాలయ బ్రహ్మో త్సవాల్లో భాగంగా జగదభిరాముని కల్యాణానికి ప్రభుత్వం తరపున ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టిటిడి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. తరువాత వారికి ఆలయ విశిష్టత, రాములవారి ప్రాశస్త్యం, సీతారా ములకు చేయించిన బంగారు ఆభరణాల గురించి వివరించారు. శ్రీసీతారాముల విగ్రహాల శిరములపై జీలకర్ర, బెల్లం పెట్టారు. ఈ మహాద్భుత సన్నివేశాన్ని వేదపండితులు ప్రజానీకానికి చూపించి సీతమ్మ వారి మెడలో మగళసూత్రాన్ని ధరింపజేశారు. ఈ మహాద్భుత దృశ్యాన్ని చూసి తరించేందుకు విచ్చేసిన భక్తులు జైశ్రీరామా అనే రామనామ స్మరణలతో కల్యాణ వేదిక, కోదండరామాలయ పరిసర ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం తలంబ్రాల కౌంటర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు. ఏకశిలానగరిలో కోదండరాముడి కల్యాణానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరి, జెఇఒలు శరత్, వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ కె.వి.మురళీకష్ణ, కలెక్టర్ శ్రీధర్, ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్, కడప, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు మాధవి, పుట్టా సుధాకర్‌యాదవ్, వరద రాజులరెడ్డి, పుత్తా కష్ణ చైతన్యరెడ్డి, జెసి నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, డిసిసిబి చైర్మన్ సూర్య నారాయణరెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒంటిమిట్టలోని టిటిడి గెస్ట్‌హౌస్‌లో రాత్రి బసచేశారు. గురువారం ఉదయం ఇక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో విజయవాడకు బయలుదేరి వెళతారు.భారీగా తరలి వచ్చిన భక్తజనం : సాయంత్రం 5 గంటల నుండి భక్తజనం భారీగా తరలివచ్చారు. ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎటు చూసిన భక్తులతోనే నిండి ఉంది. సాయంత్రం ఆరు గంటలకే జనంతో నిండిపోయింది.

# మారనున్న రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు

**విశాఖపట్టణం, ఏప్రిల్ 1, పెన్ పవర్:** లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలని పునర్విభజించాలని.. వాటి సంఖ్య 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. ఏపీలో భౌగోళికంగా, రాజకీయంగా కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయ్. 50 శాతం సీట్లు పెంచాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంతో.. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల సంఖ్య 263కి పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా.. ఏకంగా 88 అసెంబ్లీ స్థానాలు పెరగడంతో.. యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం పెరుగుతుంది. కొత్త నాయకత్వం అభివృద్ధి చెందుతుంది. చదువుకున్న యువత రాజకీయాల్లోకి వచ్చేందుకు ఈ పరిణామం ఉపయోగపడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ఎమ్మెల్యేల సంఖ్య పెరిగితే.. దానికి తగినట్లుగా శాసన మండలిలోనూ సభ్యుల సంఖ్య పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉన్నాయ్.నియోజకవర్గాల పునర్విభజన అనేది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠకు దారి తీస్తోంది. కొత్తగా 88 నియోజకవర్గాలు ఏర్పాటు చేస్తారనే ప్రచారంతో.. రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయ్. మరీ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో జరగబోయే మార్పులపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఆయా వర్గాలకు కొత్తగా రిజర్వ్ అయ్యే నియోజకవర్గాలపై.. ఇప్పటి నుంచే లెక్కలు కనిపిస్తున్నాయ్. యాడ్ అయ్యేది ఏంటి.. కోల్పోయేది ఏంటంటూ అంచనాలు వేసుకుంటున్నారు మరికొందరు నేతలు. ప్రస్తుతం చట్టసభల్లో

ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాల్లో.. మొత్తం 36 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలుగా ప్రకటించారు. ఇందులో 29 ఎస్సీలకు.. 7ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ఐతే ఇప్పుడు డీలిమిటేషన్‌తో నియోజకవర్గాలు పెరిగితే.. రిజర్వ్‌డ్ స్థానాలు కూడా పెరుగుతాయ్.ఏపీలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 263కు చేరితే.. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు కూడా రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ చట్ట ప్రకారం.. డీలిమిటేషన్ తర్వాత.. ఎస్సీలకు దాదాపు 45 స్థానాలు.. ఎస్టీలకు 12 స్థానాలు రిజర్వ్ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ప్రస్తుతం ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానాలు.. దాదాపు ప్రతి జిల్లాలో ఉండగా.. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రెండేసి స్థానాలు కేటాయించారు. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలు ఎక్కువగా ఉత్తరాంధ్రకే పరిమితం చేశారు. పోలవరం జిల్లా పరిధిలోని రంపచోడవరం తప్ప.. మిగిలిన ఆరు ఎస్టీ నియోజకవర్గాలు ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లా పరిధిలోనే ఉన్నాయ్. ఇక అరకు పార్లమెంటు నియోజకవర్గానికి ఎస్టీలకు కేటాయించారు. ఐతే ఇప్పుడు డీలిమిటేషన్ ప్రతిపాదనలతో.. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో

భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయ్.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలను ఆశిస్తున్న వాళ్లు.. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న వాళ్లు.. డీలిమిటేషన్ పరిణామాలతో తీవ్ర ఉత్కంఠ అనుభవిస్తున్న పరిస్థితి. కొత్తగా 88 స్థానాలు రాబోతుండడంతో.. నియోజకవర్గాల ముఖచిత్రం పూర్తిగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో నేతలు తమ అనువైన నియోజకవర్గాల ఏర్పాటు కోసం లెక్కలు వేసుకుంటున్నారు. తమకు పట్టున్న ప్రాంతాలను రిజర్వేషన్ కేటగిరీలో పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్న కొందరు సీనియర్ నేతలు.. ఇప్పుడు తమ నియోజవర్గాన్ని రిజర్వేషన్ కేటగిరీ నుంచి తప్పించి జనరల్ చేసుకోవాలని.. ముందు నుంచే పావులు కదుపుతున్నారట. ఏమైనా.. నియోజకవర్గాల పునర్విభజన మొదలైతే.. రాబోయే రోజుల్లో రాజకీయం సరికొత్త మలుపులు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వైసీపీ క్రెడిట్ వార్...



కడప, ఏప్రిల్ 1, ( పెన్ పవర్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమై రెండేళ్లు అవుతోంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు పూర్తయినా.. కొత్తవి వస్తున్నా.. అవి తమ క్రెడిట్ అన్నట్టు వ్యవహరిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తిరిగి క్రెడిట్ చోరీ అంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి తాము చేసింది చెప్పుకోలేదని చెబుతున్నారు. ఇప్పుడు ఇదిగో మేం చేసాం అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో ఛలో మూలపేట పోర్ట్ అంటూ సౌండ్ చేసింది వైసిపి. టెక్కలి నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణం తుది దశకు చేరుకుంది. కానీ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం జరిగింది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త వాదనను తెస్తోంది. తమ హయాంలోనే 70 శాతం పనులు జరిగాయని.. తమకి క్రెడిట్ ఇవ్వాలని కోరుతోంది. నిన్ననే ఆ పోర్టు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వైసిపి నాయకులు గట్టిగానే సౌండ్ చేశారు. 2023లో ఈ పోర్టు పనులను ప్రారంభించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడకు ఏడాది కాలంలోనే ఎన్నికలు వచ్చాయి. అయితే తాము దిగిపోయే నాటికి 70% పనులు పూర్తి చేశామని చెబుతోంది ఆ పార్టీ. ఏడాది కాలంలో 70 శాతం పనులు చేస్తే.. ఈ రెండేళ్ల కాలంలో 30% పనులు జరిగాయా అనే ప్రశ్న వినిపిస్తోంది. పైగా వైసీపీ హయాంకంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే పనులు వేగవంతం అయ్యాయన్న వాదన ఉంది. కానీ వైసీపీ ఆలోచన అదికాదు. ఈ పోర్టు నిర్మాణంలో తమ పార్టీ ముద్ర ఉండాలని బలంగా కోరుకుంటుంది. పైగా అదనపు భూసేకరణ అనే అంశం తెరపైకి వస్తే దానిని పట్టుకొని పోరాటం చేయాలని చూస్తోంది. తద్వారా టెక్కలి నియోజకవర్గంలో పాటు శ్రీకాకుళం జిల్లాలో పట్టు పెంచుకోవాలని భావిస్తోంది. అందుకే ఉత్తరాంధ్ర నుంచి వైసిపి నేతలంతా ఈ కార్యక్రమానికి కదలి వచ్చారు.ప్రస్తుతం మూలపేట పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపు తుది దశకు చేరుకుంటున్నాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి పోర్టు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక క్రెడిట్ కోసం ప్రయత్నిస్తుంటారు. కానీ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇది మా వల్లే సాధ్యం అయింది అని ప్రజల్లోకి సంకేతాలు పంపించగలిగింది. అయితే దీనిని కూటమి ధీటుగానే బదులిస్తోంది. ఈ క్రెడిట్ ఆరాటాన్ని ప్రజలు పట్టించుకోరని తేల్చి చెబుతోంది.

## నిఘా కళ్లలో అమరావతి



**గుంటూరు, ఏప్రిల్ 1, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. రాజధాని నగర పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కీలక ప్రకటన విడుదల చేశారు. రాజధాని ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని అవాంఛనీయ ఘటనలు, అమరావతి నిర్మాణం తిరిగి ఊపందుకుంటున్న వేళ విద్రోహక శక్తులు తలదూర్చకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ హై అలర్ట్ ప్రకటించినట్టు తెలుస్తోంది. ఈ భద్రతా వ్యూహంలో భాగంగా తక్షణమే అమలులోకి వచ్చేలా ఆరు ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కేవలం పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం ఈ కొత్త ప్రోటోకాల్ ప్రధాన ఉద్దేశం. రాజధాని లోపలికి వచ్చే, బయటకు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసేందుకు 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీని వల్ల అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఆధునిక సాంకేతికతను జోడించి, రాత్రి సమయాల్లో క్షేత్రస్థాయిలో పోలీసులు వెళ్లలేని ప్రాంతాలను సైతం గమనించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్ కెమెరాలు నిరంతరం ఆకాశం నుంచి నిఘా వేసి, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. పోలీసు వాహనాలు నిరంతరం రాజధాని రహదారులపై గస్తీ తిరుగుతూ ఉంటాయి. ఇది నేరస్తుల్లో భయం కలిగించడమే కాకుండా, స్థానికుల్లో, నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికుల్లో భద్రతా భావాన్ని కల్పిస్తుంది. అమరావతిలో ప్రస్తుతం అనేక నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయా నిర్మాణ సంస్థలకు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాజధాని ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం పోలీసులదే కాదని, సంబంధిత సంస్థలు కూడా సహకరించాలని పోలీసులు పేర్కొన్నారు.ప్రతి నిర్మాణ ప్రాంగణంలో హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

నిర్మాణ సంస్థలు తమ సొంత సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకొని, పగలు, రాత్రి వేళల్లో గస్తీ కాయాలి. నిర్మాణ సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ హెచ్చరించారు.

# జనసేనలోకి వంగా గీత

**కాకినాడ, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
రాష్ట్ర రాజకీయాల్లో పిఠాపురం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఈ నియోజకవర్గ నుంచి పోటీ చేసిన తర్వాత దీని ప్రాధాన్యం పెరిగింది. గత కొంతకాలంగా ఇక్కడ కూటమి దూకుడుగా ఉంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అభివృద్ధి సైతం పరుగులు పెడుతోంది. ఇంకోవైపు టిడిపి ఇన్చార్జిగా మాజీ ఎమ్మెల్యే వర్మ ఉన్నారు. కూటమిపై రకరకాల అభిప్రాయాలు ఉన్న ఇక్కడ మాత్రం బలంగానే ఉంది. ఈ తరుణంలో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు తగ్గాయి. ఆ పార్టీ క్యాడర్లో నిరుత్సాహం అలుముకుంది. పవన్ పై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీత ఇప్పుడు పెద్దగా యాక్టివ్ గా లేరు. ఆ నియోజకవర్గంలో వైసిపి గెలిచే ఛాన్స్ లేదని తెలిసి ఆమె పూర్తిగా సైడ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి సైతం తాను అక్కడ పని చేయలేనని క్లియర్ కట్ గా చెప్పినట్లు సమాచారం.మొన్నటి ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా ఉన్న వంగా గీతను తీసుకొచ్చి పిఠాపురంలో పోటీ చేయించారు. మహిళ నేతకు కావడంతోపాటు గతంలో పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడంతో ఆమె వైపు మొగ్గు చూపారు. ఆపై ముద్రగడ పద్మనాభం సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఇచ్చేది పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. దీంతో ఊరు హోరాహోరీగా ఉంటుందని అంతా భావించారు. కానీ అటువంటి పరిస్థితి లేదు. ఏకంగా 70000 ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచారు పవన్ కళ్యాణ్. గెలిచిన తరువాత మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ నియోజకవర్గం వర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. అక్కడి ప్రజలు పవన్ కళ్యాణ్ పనితీరు పట్ల సంతృప్తిగా ఉన్నారని కూడా తెలుస్తోంది. మరోవైపు వైయస్సార్





కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ధైర్యం చెప్పే నేతలు లేకుండా పోయారు. రాష్ట్రస్థాయి విషయాలు మాట్లాడేందుకే అన్నట్టు ముద్రగడ పద్మనాభం పరిస్థితి ఉంది. వంగా గీత సైతం పార్టీ శ్రేణులకు పెద్దగా ప్రయారిటీ ఇవ్వడం లేదు. స్థానికంగా కూడా అందుబాటులో లేరని తెలుస్తోంది. కొద్దిరోజుల కిందట జగన్మోహన్ రెడ్డి వంగా గీతను పిలిచి మాట్లాడారట. పిఠాపురం నియోజకవర్గంలో యాక్టివ్ కావాలని సూచించారట. అందుకు ఆమె అంగీకరించలేదట. పవన్ కళ్యాణ్ ఉండగా పిఠాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ గెలిచే పొజిషన్లో లేదని.. అందుకే తాను నియోజకవర్గ ఇన్చార్జి పోస్టును తీసుకోలేనని ఆమె తేల్చి చెప్పారట. తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వంగా గీత ప్రజారాజ్యం పార్టీలో కూడా పనిచేశారు. అందుకే ఆమె విషయంలో

పవన్ కళ్యాణ్ సైతం గౌరవంగానే మెలిగారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆమెను జనసేనలో చేర్చుకుంటామని కూడా బాహటంగానే చెప్పారు పవన్. అయితే ఇప్పుడు వంగా గీత వ్యవహార శైలి చూస్తుంటే ఆమె జనసేనకు దగ్గరవుతారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# వైసీపీ కొత్త గేమ్ ప్లాన్



**విజయవాడ, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త పోరాటం మొదలైంది. అసెంబ్లీలో తగినంత సంఖ్యాబలం లేకపోయినా, అధికార కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్ర స్థాయిలో శాసనమండలిని, జాతీయ స్థాయిలో పార్లమెంటును వేదికలుగా చేసుకుని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే ఈ కొత్త గేమ్ ప్లాన్ అసలు ఉద్దేశంగా కనిపిస్తోంది.అసెంబ్లీలో వైసీపీ బలం తక్కువగా ఉండటంతో, సభా కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది వైసీపీ. అయితే శాసనమండలిని మాత్రం వదులుకోవడం లేదు. మండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటాన్ని పూర్తిస్థాయిలో అనుకూలంగా మార్చుకుంటోంది. ఇటీవల 15 రోజుల పాటు జరిగిన సమావేశాల్లో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రతిరోజూ ప్రభుత్వాన్ని నిలదీశారు.ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారం, టీటీడీ నిర్ణయాలు, రైతుల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగ భర్తీ వంటి అంశాలపై వైసీపీ గట్టిగా పోరాడింది. లడ్డూ వివాదంపై చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టి, వరుసగా వాయిదా తీర్మానాలు ఇచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. చివరకు ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధం కాకపోయినా, కనీసం స్టేట్‌మెంట్ ఇచ్చేలా చేయగలిగింది. దీన్ని వైసీపీ నేతలు తమ నైతిక విజయంగా చెప్పుకుంటున్నారు. మండలిలో ఉన్న బలాన్ని వాడుకుంటూ అధికార పక్షాన్ని సమాధానం చెప్పాల్సిన పరిస్థితికి నెట్టడంలో వారు సఫలమవుతున్నారు.అదే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో పార్లమెంట్ వేదికను వైసీపీ వ్యూహాత్మకంగా వాడుకుంటోంది. వైసీపీ ఎంపీలు పార్లమెంట్‌లో గళం విప్పుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ దాడులు, శాంతిభద్రతల సమస్యలు, అమరావతి అప్పుల అంశాలను వారు ఢిల్లీ వేదికగా ఎండగడుతున్నారు.ఈ వ్యూహంలో భాగంగానే అనంతపురం జిల్లాకు చెందిన ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధుల వెసులుబాటు కల్పించడంలో వైసీపీ చేసిన పోరాటం ఫలితాన్ని ఇచ్చిందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి తిరిగి అనుమతులు ఇవ్వడం తమ విజయమేనని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.అసెంబ్లీని స్కిప్ చేసినా.. మండలి, పార్లమెంట్ ద్వారా తమ వాయిస్‌ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైసీపీ భావిస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో ఎమ్మెల్సీలు, మరోవైపు ఢిల్లీలో ఎంపీలు సమాంతరంగా పోరాటం చేస్తుండటంతో కూటమి సర్కార్ రక్షణలో పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ డ్యూయల్ స్ట్రాటజీ ద్వారా వైసీపీ తన ఉనికిని చాటుకోవడమే కాకుండా, కూటమి వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచగలుగుతోంది

# పంచాయితీ రాజ్ శాఖకు అవార్డుల పంట

**నెల్లూరు, ఏప్రిల్ 1, పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్న్?న్న పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు వరించాయి. రెండు విభాగాల్లో తొలిస్థానంలో నిలిచిన ఏపీ పంచాయతీరాజ్ శాఖ.. ఓ విభాగంలో రెండో స్థానంలో.. మరో రెండు విభాగాల్లో తృతీయ స్థానంలో నిలిచి అవార్డులు గెలుచుకుంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, జల్ సంచయ్ -జన్ భాగీదారీ విభాగాల్లో తొలిస్థానంలో నిలిచింది. మొత్తంగా గతంలో 24వ ప్లేసులో ఏపీ పంచాయతీరాజ్ శాఖ .. నేడు దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందిడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు పంట పండింది. ఏపీ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఒక విభాగంలో ద్వితీయ స్థానంలో నిలవగా., మరో రెండు విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి అవార్డులు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, వివిధ సేవల్లో మెరుగైన పనితీరు ఆధారంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది.రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి విభాగంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. గత ప్రభుత్వం హయాంలో 24వ స్థానంలో నిలిచిన ఏపీ పంచాయతీరాజ్ శాఖ.. ఈసారి దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం విశేషం. గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించేలా చేయటం, అలాగే ప్రణాళికబద్ధమైన అభివృద్ధి కోసం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. అలాగే జల్ సంచయ్ – జన్ భాగీదారీ కార్యక్రమం కింద తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వచేసే పద్ధతులను ప్రోత్సహిస్తారు. ఈ రెండు విభాగాల్లో దేశంలోనే తొలి స్థానంలో ఏపీ పంచాయతీరాజ్ శాఖ నిలిచింది.మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఐదు మంత్రిత్వ శాఖల బాధ్యతలు చూస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖ, శాస్త్ర సాంకేతికత శాఖలను పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలను పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0 కార్యక్రమాలు చేపట్టారు.అలాగే ఒకేసారి రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. గ్రామసభలలో వచ్చిన వినతుల ఆధారంగా పల్లెవెలుగు కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## మహిళ క్రికెట్‌లో సంచలనం.. టీమిండియా
# రికార్డు బ్రేక్ చేసిన కివీస్ కెప్టెన్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా మహిళల రెండో వన్డే వెల్లింగ్టన్ వేదికగా జరిగింది. ఈ మ్యాచులో కివీస్ అమ్మాయిల జట్టు చారిత్రత్మక విజయాన్ని నమోదు చేసింది. సఫారీ జట్టు నిర్దేశించిన 347 పరుగుల టార్గెట్ న్ని చేధించి టీమిండియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును న్యూజిలాండ్ తిరగరాసింది. ఉమెన్స్ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు ఛేజ్ చేసిన జట్టుగా బ్లాక్ క్యాప్స్ రికార్డుల్లోకి ఎక్కింది. కాగా ఇంతకు ముందు ఈ హిస్టరీ భారత మహిళల జట్టు పేరుపై ఉండేది. వన్డే ప్రపంచకప్-2025లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ లో ఉమెన్ ఇన్ బ్లూ.. 339 రన్స్ లక్ష్యాన్ని చేజ్ చేసింది. ఇప్పుడు ఈ రికార్డును న్యూజిలాండ్ బ్రేస్ చేసేసింది. ఈ మ్యాచ్ మొదట బ్యాటింగ్ చేసిన ప్రోటీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 346 రన్స్ చేయగా.. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో అన్నేకే బోష్ (91), కెప్టెన్ లారా వోల్వార్డ్(69), ట్రయోన్(52), జాఫ్టా(37) అద్భుతంగా ఆడారు.

ఇక ఈ భారీ లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు సుజీ బేట్స్(8), ప్లిమ్మర్(23), మ్యాడీ గ్రీన్(13) ఘోరంగా విఫలం కావడంతో కెప్టెన్ అమెలియా కెర్ మాత్రం సంచలన ఇన్నింగ్స్ ఆడింది. ఓ వైపు క్రమంగా వికెట్లు పడుతున్నప్పటికి ఆమె మాత్రం తన విధ్వంసకర బ్యాటింగ్ ని కొనసాగించింది. చివరి ఓవర్లో 11 పరుగులు కావాల్సి ఉండగా.. కేర్ వరుసగా 3 బౌండరీలు బాది కివీస్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఈ మ్యాచులో కెప్టెన్ అమేలియా కెర్ కేవలం 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్సుతో 179 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

మొత్తంగా మహిళల వన్డే క్రికెట్లో లక్ష్య చేధనలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన రెండో ప్లేయర్ గా అమెలియా కేర్ నిలిచింది. అలాగే న్యూజిలాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన మహిళ ప్లేయర్ గా కూడా కేర్ చరిత్ర నెలకొల్పింది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా ప్రెజెంటేషన్‌లో కేర్ మాట్లాడుతూ.. ఈ ఇన్నింగ్స్ నాకు చాలా ప్రత్యేకమైనది. మేము డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నప్పుడు కూడా గెలవగలమని నమ్మా, నేను మైదానంలోకి వెళ్లిన తర్వాత ముందుకు సాగాల్సిందేనని ఫిక్స్ అయినట్లు వెల్లడించింది.

# ఐపీఎల్‌లో డబ్బులు రావు.. అందుకే ఆడట్లేదు: ఆడమ్ జంపా

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని అత్యుత్తమ వైట్ బాల్ స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, ఐపీఎల్ 2026 వేలానికి దూరంగా ఉండటంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన నైపుణ్యానికి ఐపీఎల్‌లో సరైన విలువ, డబ్బు లభించడం లేదని, అందుకే ఈ లీగ్‌లో ఆడటం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జంపా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ జంపా తన అసంతృప్తిని బయటపెట్టాడు. "ఈ ఏడాది నేను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాను. నిజం చెప్పాలంటే, నా లాంటి నైపుణ్యం ఉన్న ఆటగాడికి ఐపీఎల్‌లో ఇతర నైపుణ్యాలు ఉన్నవారికి లభించేంత డబ్బు రాదు. ఐపీఎల్ కోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు తగిన ప్రతిఫలం లేనప్పుడు అంత సమయం వెచ్చించడం సరైన నిర్ణయం అని నాకు అనిపించలేదు" అని జంపా వివరించాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జంపాను విడుదల చేయగా, అతను ఈసారి వేలం కోసం తన పేరును నమోదు చేసుకోలేదు. 2016లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌తో అరంగేట్రం చేసిన అతను, ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 22 ఐపీఎల్ మ్యాచ్‌లలో 8.37 ఎకానమీ రేటుతో 31 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఏ సీజన్‌లోనూ ఆరు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు.

పీఎస్ఎల్‌లో ఆడాలన్నది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయమని జంపా తెలిపాడు. మొదట విశ్రాంతి తీసుకోవాలని భావించినా, నెల రోజుల క్రితం పీఎస్ఎల్ నుంచి అవకాశం రావడంతో వెంటనే అంగీకరించానని చెప్పాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తుది జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం ఉంటుంది. దీంతో ఫ్రాంచైజీలు ఎక్కువగా పవర్ హిట్టర్లు, ఆల్-రౌండర్లు, ఫాస్ట్ బౌలర్ల కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తాయి. స్పిన్నర్ల విషయంలో భారత్‌లో



నాణ్యమైన స్థానిక ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో విదేశీ స్పిన్నర్లకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. జంపా వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# భారత్-జింబాబ్వే మధ్య రెండు సిరీస్‌లు.. షెడ్యూల్ విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది జులైలో జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు జింబాబ్వే క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన విడుదల చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 దశ మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. తాజా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న గ్రూప్‌లో టాప్‌లో నిలిచి సూపర్-8కు చేరిన జింబాబ్వే, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది.

ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ.. "భారత్‌తో మ్యాచ్‌లంటే ఎప్పుడూ భారీ ఆసక్తి ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం మా ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశం. ప్రపంచకప్‌లో మా ప్రదర్శన ప్రోత్సాహకరంగా ఉంది. ఈ సిరీస్ ద్వారా ఆ జోరును కొనసాగించి, అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ శక్తిగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుంది" అని వివరించారు. ఇక, వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనున్నట్లు బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. 2027 జనవరిలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషం. చివరిసారిగా 2002 మార్చిలో జింబాబ్వే భారత్‌లో పర్యటించింది. ఈ సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో పర్యటించడంపై మకోనీ సంతోషం వ్యక్తం చేశారు. "రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించడం ఒక చారిత్రాత్మక క్షణం. ఇది మా ఆటగాళ్లకు దక్కిన గౌరవం, విలువైన అవకాశం. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, మా జట్టుకు ఎంతో అనుభవాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

# అఖిల్ ని మారుతి లైన్ లో పెడుతున్నాడా?

అక్కినేని వారసుడు అఖిల్ సక్సెస్ కోసం ఎలా ఎదురు చూస్తున్నాడో? చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న -ఏజెంట్- ఫలితం ఊహించని విధంగా రావడంతో? మరోసారి ఫ్లాప్ రూపంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. -మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్- తో వచ్చిన సక్సెస్ ను -ఏజెంట్- తోనూ కొనసాగించాలని చూసిన ఆలోచనకు బ్రేక్ పడింది. -ఏజెంట్- హిట్ అయితే కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుందని ఎంతో ఆశించాడు కానీ ఫలితం తీవ్ర నిరాశనే మిగిల్చింది. దీంతో కొత్త కథలు, దర్శకుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడు.





ప్రస్తుతం మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో -లెనిన్- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశకే చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగు తున్నాయి. సమ్మర్ కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే అగ్ర హీరోల చిత్రాలు రిలీజ్ కు ఉండ టంతో వెనక్కి తగ్గుతున్నాడు. మరి తదుపరి చిత్రాల సంగతేంటి? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. అఖిల్ కోసం మారుతి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అఖిల్ తో రెండు..మూడు మీటింగ్లు కూడా జరిగాయని సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

మరి ఈ కాంబో సెట్ అవుతుందా? లేదా? అన్నది ఇంకా చర్చల దశలో ఉంది కాబట్టి క్లారిటీ రావడానికి సమయం పడతుంది. మారుతి చివరిగా ప్రభాస్ తో తెరకెక్కించిన -ది రాజాసాబ్- ఫ్లాప్ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మారుతి హీరోల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తర్వాత ఏ హీరోతో సినిమా చేసిన అది పక్కా హిట్ అవ్వాలనే కసితో పని చేస్తున్నాడు. ఇప్పటికే మారుతి అక్కినేని కాంపౌండ్ లో నాగచైతన్య హీరోగా -శైలిజ రెడ్డి అల్లుడు- అనే సినిమా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ కమర్శియల్ గా మంచి లాభాలే తెచ్చి పెట్టింది. ఆ పాజిటివ్ సైన్ అఖిల్ సినిమా పరంగా కలిసొచ్చే అవకాశం ఉంది.

అఖిల్ కూడా కొత్త దర్శకుల్ని ఎంచుకోవడంలో విఫలమవుతున్నాడు. ఇంత వరకూ అతడు చేసిన ప్రయత్నాల్లో ఒకటి రెండు తప్ప పెద్దగా కలిసి రాలేదు. ఈ క్రమంలో మారుతి లాంటి అనుభవం ఉన్న దర్శకుడితో సినిమా చేస్తే అఖిల్ కి ప్లస్ అవుతుందనే భావన ఉంది. ఇంకా అఖిల్ వేర్వేరు దర్శకులతోనూ టచ్ లో ఉన్నాడు. వాళ్లందరిలో ఎవరి మంచి కథతో ముందుకొస్తే వాళ్లతోనే ముందుకెళ్తాడు. మరి మారుతి విషయంలో ఎలాంటి ప్రకటన వస్తుందో చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965